క్లుప్తంగా

పథకాలను సద్వినియోగం చేసుకోండి



కటారుకొండలో ప్రకృతి వ్యవసాయంపై రంగవల్లి ద్వారా అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కృష్ణగిరి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఈఓఆర్డీ మురళీమోహన్ సూచించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని కటారుకొండ, బోయబొంతిరాళ్ల గ్రామాల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల కోసం ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయుష్మాన్ భారత్ కార్డులు, క్యాలెండర్లు ఆవిష్కరించారు. వైద్యాధికారి వరప్రసాద్,ఏఈఓ రాజేష్, నాయకులు రామలింగం, నగిరి రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి ధనుర్మాస పూజలు



రంగనాథస్వామి

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో కొలువైన రంగనాథ స్వామి వారికి 16వ తేదీ నుంచి వచ్చే ఏడాది జనవరి 15వ తేదీ వరకు ధనుర్మాస పూజలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్, ఈఓ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ.. సూర్యోదయానికి ముందే శ్రీమహా విష్ణువు రాజ్యలక్ష్మి సమేత రంగనాథ స్వామివారికి ప్రత్యేక పూజలు, గోదాదేవి వారి తిరుప్పావై పాశురములు, ప్రవచనం ప్రతి రోజు నిర్వహిస్తామన్నారు. 23న వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్వామి వారు ఉత్తర ద్వారం గుండా దర్శనమిస్తారన్నారు. జనవరి 14న రంగనాథ స్వామి గోదాదేవి వార్లకు కల్యాణోత్సవం, ప్రభోత్సవం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. 15న ధనుర్మాస పూజల ముగింపు అలాగే మకర సంక్రాంతి పర్వదినాన స్వామి వారికి ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. భక్తులు పూజల్లో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలన్నారు.

విద్యార్థినికి ట్యాబ్ పంపిణీ

ఆస్పరి: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో 8వ తరగతి చదువుచున్న విద్యార్థిని అర్చనకు హెచ్‌ఎం విజయకుమారి రూ.28 వేలు విలువ చేసే ట్యాబ్‌ను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. ప్రభుత్వం దివ్యాంగులకు డిజిటల్ విద్య అందించేలా ప్రాధాన్యత నిస్తోందన్నారు. వినికిడి, దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు ట్యాబ్‌లు వినియోగించుకునేందుకు వీలుగా ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను పొందుపరిచారన్నారు. ట్యాబ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలో నలుగురు విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేసినట్లు ఎంఈఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

పీడీఎఫ్ బియ్యం స్వాధీనం

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల నుంచి గురువారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న పీడీఎఫ్ బియ్యాన్ని తహసీల్దార్ ఆంజనేయులు పట్టుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసం ఉంచిన 6 క్వింటాళ్ల బియ్యంను రాత్రి ఆటోలో అక్రమంగా తరలిస్తున్నారు. దీనిపై తహసీల్దార్ ఆంజనేయులుకు సమాచారం అందడంతో వెంటనే స్పందించి ప్రభుత్వ జూనియర్ కాలేజీ గేటు వద్ద ఆటోను పట్టుకుని పట్టణ పోలీసుస్టేషన్‌లో అప్పగించారు. తహసీల్దార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పల్లెల్లో మెరుగైన వైద్య సేవలు

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానంతో పల్లెల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని హాలహర్వి పీహెచ్‌సీ డాక్టర్ పరిమళ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని నదికైరవాడి గ్రామంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు 104 ద్వారా వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫ్యామిలీ ఫిజిషియన్ విధానంతో గ్రామాలలో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఇంటి వద్దకే వైద్య సేవలు అందుతున్నాయన్నారు. బీపీ, షుగర్, ఆస్తమా, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. అలాగే గర్భిణులు, బాలింతలకు టీకాలు, ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించామన్నారు.ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్‌మెన్ ఆత్మహత్యాయత్నం

హాలహర్వి: గత పది సంవత్సరాలుగా వాటర్ మెన్‌గా సిద్ధాపురం, అమృతాపురం గ్రామాల్లో పనిచేస్తున్న తనను కాదని మండలంలోని అమృతాపురం గ్రామానికి చెందిన శేఖర్‌ను పనిలోకి తీసుకుంటున్నట్లు తెలియడంతో పరశురాం అనే వ్యక్తి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో వాటర్‌మెన్ పరశురాం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే హాలహర్వి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం వైద్యుల సూచన మేరకు బళ్లారి ఓపీడీ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అవ్వాతాతలకు ఆసరా

- నియోజకవర్గంలో 34,125 మందికి పింఛన్లు
- ప్రతి నెలా పింఛన్‌దారులకు రూ.9.47 కోట్లు పంపిణీ



రాతనలో లబ్ధిదారు సంగీతకు రూ.5 వేలు పింఛన్ పంపిణీ చేసేందుకు పాటో తీస్తున్న పంచాయతీ కార్యదర్శి శివ (ఫైల్)



కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాంపల్లి ఎర్రబాటి చిన్నలాలుకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ ఆర్.సురేష్ (ఫైల్)

తుగ్గలి: వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, వారికి ఆర్థిక ఆసరాగా ప్రతి నెలా మొదటి రోజునే ప్రభుత్వం క్రమం తప్పకుండా పింఛన్ అందిస్తోంది. వృద్ధుల పోషణకు పింఛన్ ఎంతగానో ఉపకరిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పక్కాగా అమలు చేస్తున్న 'వైఎస్సార్ పింఛన్ కానుక' పథకంతో లబ్ధిదారులకు భరోసా లభించింది. ఫలితంగా వృద్ధులు ఇంటి వద్దనే పిల్లల ప్రేమ, అనురాగం మధ్య సంతోషంగా జీవిస్తున్నారు.

నెలనెలా రూ.9.47 కోట్ల పంపిణీ

పత్తికొండ నియోజకవర్గ పరిధిలో 34,125 మందికి పింఛన్లు అందుతున్నాయి. గత ప్రభుత్వంలో ఏడాదికో, ఎన్నికల వేళ కొత్త పింఛన్లు మంజూరయ్యేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పింఛన్‌కు అర్హులైన వారి నుంచి నిరంతరం దరఖాస్తులను వలంటీర్ల ద్వారా సేకరిస్తోంది. సచివాలయ ఉద్యోగుల ద్వారా పరిశీలన చేసి కొత్త పింఛన్లు మంజూరు చేస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రూ.2 వేల పింఛన్ విడతల వారీగా పెంచుతూ పోవడంతో రూ.2,750కు చేరింది. వచ్చే జనవరి నెల నుంచి రూ.3 వేలు పింఛన్ అందించనున్నారు. గతంలో పింఛన్ కోసం లబ్ధిదారులు రోజుల తరబడి ప్రభుత్వ కార్యాలయాలు, రచ్చబండ వద్ద పడిగాపులు కాసేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ప్రతినెలా 1వ తేదీ వేకువజామునే వలంటీర్ల ద్వారా ఇంటి వద్దనే లబ్ధిదారులు పింఛన్ అందుకుంటున్నారు. ఈ మార్పు లబ్ధిదారులకు ఎంతో భరోసానిచ్చి వారి మోములో సంతోషం నింపింది. ప్రస్తుతం డిసెంబర్ నెలకు సంబంధించి మొత్తం 34,125 మంది లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము రూ.9.47 కోట్లను ప్రభుత్వం అందించింది. వచ్చే జనవరి నుంచి ఈ మొత్తం మరింత పెరగనుంది.

మండలాల వారీగా అందిస్తున్న పింఛన్ సొమ్ము వివరాలు

మండలం	లబ్ధిదారులు	నగదు మొత్తం (రూ.)
పత్తికొండ	8,681	2,42,36,500
వెల్దుర్తి	7,999	2,21,67,000
తుగ్గలి	7,758	2,14,05,850
కృష్ణగిరి	4,861	1,36,34,250
మద్దికెర	4,826	1,32,71,250

సంతోషంగా జీవిస్తున్నాం



గత ప్రభుత్వ హయాంలో పింఛన్ సొమ్ము ఎప్పుడిస్తారా అని ఎదురుచూడాల్సి వచ్చేది. పంపిణీ రోజు రచ్చకట్ట వద్ద ఎండలో గంటల తరబడి వేచి ఉండేవాళ్లం. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి ఆయ్యాక ప్రతినెలా 1వ తేదీ తెల్లవారుజామునే వలంటీర్ ఇంటికొచ్చి పింఛన్ సొమ్ము అందిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా సంతోషంగా జీవిస్తున్నాం. మాలాంటి ముసలోళ్లకు పింఛను సొమ్మే ఆధారం. పింఛన్ సక్రమంగా అందుతుండడం వల్ల ముసలోళ్లపై ఇళ్లలో గౌరవం, ప్రేమ పెరిగింది. మాలాంటోళ్లకు బాగుగోలు చూస్తున్న జగన్‌కు రుణపడి ఉంటాం. – సంజన్న, పింఛన్ లబ్ధిదారుడు, ముక్కెల్ల

బాధలు తప్పాయి



గతంలో పింఛన్ తీసుకోవాలంటే ఎన్నో బాధలు పడాల్సి వచ్చేది. సిగ్నల్ సమస్యతో ఐదారు రోజులైనా పింఛన్ అందేది కాదు. ఊర్లో సిగ్నల్ రాకపోతే చాలా కష్టంతో గుట్టలు ఎక్కి పింఛన్ తెచ్చుకోవాల్సి వచ్చేది. నరాల బలహీనతతో కదలలేని పరిస్థితి. సీఎం వైఎస్ జగన్ వచ్చాక పింఛన్ సొమ్ము రూ.5 వేలకు పెంచడంతో పాటు ప్రతి నెలా 1వ తేదీనే ఇంటి వద్దకే తెచ్చి ఇస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం. – రంగనాయకులు, పింఛన్ లబ్ధిదారుడు, శభాష్‌పురం

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

నందవరం: మండల పరిధిలోని కనకవీడు గ్రామ జెడ్పీ పాఠశాల విద్యార్థిని అనసూయ జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపికైంది. ఇటీవల మదనపల్లెలో జరిగిన అండర్-14 హాకీ విభాగంలో విద్యార్థిని ఉత్తమ ప్రతిభ కనబరచడంతో జాతీయ స్థాయికి ఎంపికైంది. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో క్రీడాకారిణి అనసూయను ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. హెచ్‌ఎం గౌరమ్మ మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు.

గద్దెరాళ్ల మారెమ్మ దేవస్థాన ట్రస్ట్ బోర్డుకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు కల్చరల్: దేవనకొండ మండలం గద్దెరాళ్ల గ్రామంలోని మారెమ్మ దేవస్థానం ట్రస్ట్ బోర్డు నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు దేవదాయశాఖ సహాయ కమిషనర్ ఎం.రామాంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత ఆలయం కార్యనిర్వహణాధికారి వద్ద దరఖాస్తులు లభిస్తాయన్నారు. ఆసక్తి ఉన్న వారు జనవరి 3వ తేదీలోగా కర్నూలులోని మద్దూరునగర్‌లో ఉన్న దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలన్నారు. రిజిస్టర్ పోస్ట్ ద్వారా కూడా దరఖాస్తు పంపవచ్చన్నారు. అభ్యర్థులు దరఖాస్తుతోపాటు కులధ్రువీకరణ పత్రం, ఆధార్ జిరాక్స్ కాపీ, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను జత చేయాలని సూచించారు.

రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత



ఎంబీ చర్చి వద్ద రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యతనిస్తున్నట్లు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం స్థానిక ఎస్సీ కాలనీలోని ఎంబీ చర్చి నుంచి కలుగొట్ల ప్రధాన రహదారి వైపు ఉన్న ముస్లిం శ్మశానవాటిక వరకు దెబ్బతిన్న రోడ్డును ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఆ రోడ్డు మున్సిపాలిటీ పరిధిలోకి వస్తుందని ఆర్‌అండ్‌బీ అధికారులు పేర్కొనడంతో వెంటనే సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేసి నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని డీఈ మనోహర్ రెడ్డికి సూచించారు. రోడ్ల నిర్మాణాల్లో అలసత్వం వహించక సాధ్యమైనంత వరకు సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, కోడుమూరు ఆర్‌అండ్‌బీ డీఈ శివరుద్ర, సూపర్‌వైజర్ ప్రభు తదితరులు ఉన్నారు.

ఉపాధి కల్పనపై నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న డ్వామా పీడీ అమరనాథ్‌రెడ్డి

నందవరం: గ్రామాల్లో ఉపాధి పనుల కల్పనపై నిర్లక్ష్యం తగదని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథ్‌రెడ్డి హెచ్చరించారు. ఆయన గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మండలస్థాయి సామాజిక తనిఖీ సభ నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఉపాధి పనుల్లో రూ.8,044 అవినీతి చోటుచేసుకున్నట్లు బహిర్గతం చేశారు. మండలంలోని మాచాపురంలో రూ.2,934, నదికైరవాడిలో రూ.2,105, నాగలదిన్నెలో రూ.640, నందవరంలో రూ.1,915, పూలచింతలో రూ.450 అవినీతి జరిగినట్లు వివరించారు. అలాగే పనుల్లో అలసత్వం వహించిన గ్రూపులకు రూ.26 వేలు జరిమానా విధించారు. సోమలగూడూరు రూ.8 వేలు, గురజాలలో రూ.6 వేలు, కనకవీడులో రూ.2 వేలు, ముగతిలో రూ.వెయ్యి, నదికైరవాడి రూ.4 వేలు, నాగదిన్నెకు రూ.2 వేలు, పూలచింతకు రూ.3 వేలు జరిమానా వేశారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. రైతులకు ఉద్యానవన పంటలపై అవగాహన కల్పించాలని సూచించారు. మండలంలో 400 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు లక్ష్యంగా నిర్దేశించారు. అడిషనల్ పీడీ మాధవిలత, ఏపీడీ అల్లిపీరా, జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ భాస్కర్, అంబుడ్స్‌మెన్ చంద్రశేఖర్, ఎంపీడీఓ దశరథరామయ్య, సీఆర్పీ మల్లికార్జున, ఏపీఓ శ్రీనివాసులు, పీఆర్ ఏఈ జయన్న, ఈసీ నూర్జాహాన్ పాల్గొన్నారు.

నందవరం: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలని ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేష్‌గౌడ్ కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సామాజిక తనిఖీ నిమిత్తం వచ్చిన డ్వామా పీడీ అమరనాథ్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

రత్నపల్లెలో ఇరువర్గాల ఘర్షణ

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండల పరిధిలోని రత్నపల్లె గ్రామంలో బుధవారం రాత్రి దాయాదుల మధ్య ఘర్షణ రేగింది. నూతన సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం విషయంలో గొడవపడ్డ దాయాదులు ఇరువర్గాలుగా ఏర్పడి ఒకరిపై ఒకరు దాడులకు పూనుకున్నారు. ఇరువర్గాలలోని పలువురు గాయపడి కర్నూలు, వెల్దుర్తి ఆసుపత్రులలో చికిత్స పొందుతూ స్థానిక పోలీసులను ఆశ్రయించారు. ఇరువర్గాలు 14 మందిపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం సీఐ సురేశ్‌కుమార్ రెడ్డి రత్నపల్లె గ్రామానికి వెళ్లి విచారించారు. ఘర్షణ పడ్డ ఆయా కుటుంబాల వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. చిన్న చిన్న విషయాలకు గొడవలు పడి మనశ్శాంతి కోల్పోవద్దని, కేసులతో చిక్కులు తప్పవన్నారు. సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని లేదా తమను సంప్రదించాలని సూచించారు.

దివ్యాంగులకు పరికరాల పంపిణీకి చర్యలు



శిబిరానికి తరలి వచ్చిన దివ్యాంగులు

హొళగుంద: దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లకు సహాయ పరికరాలను అందించేందుకు అర్హులను గుర్తించే కార్యక్రమాన్ని గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ శిబిరంలో అలెవన్ కో టీం హైదరాబాద్‌కు చెందిన టెక్నీషియన్ సుందరయ్య, పీఓ సునీత, ఆడియాలజిస్ట్ నిఖిత్, ఏడీపీ శివకృష్ణ, డాటామ్యాన్ హృతిక్ బృందం పాల్గొన్నారు. మానసికంగా, చవిటి, మూగ, కాళ్లు, చేతులు లేని వారికి పరీక్షలు చేసి నీతి ఆయోగ్ ద్వారా పరికరాలు అందించనున్నట్లు పీఓ తెలిపారు. అలాగే అవసరమైన వారికి వీల్‌చైర్స్, స్టిక్స్, మోటరైజ్డ్ ట్రైసైకిళ్లు అందిస్తామన్నారు. కర్నూలు జిల్లా ఏపీ డిఫరెంట్లీ ఏబుల్డ్, సీనియర్ సిటిజన్స్ అసిస్టెన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏడీఐపీ, ఆర్‌వీవై పథకం కింద నీతి అయోగ్ చొరవతో దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ల సదరం సర్టిఫికెట్లు, ఇతర వైద్యుల ధ్రువీకరణ పత్రాలతో పాటు పరికరాలు పొందేందుకు అర్హతను పరీక్షించి వివరాలు నమోదు చేసుకున్నారు.

ఆలయ అభివృద్ధికి సహకారం



వెల్దుర్తిలో అయ్యప్ప మాలధారుల ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి(కృష్ణగిరి): స్థానిక జర్నలిస్టు కాలనీలోని వేంకటేశ్వర, అయ్యప్ప, సాయినాథుని ఆలయ సమూహం అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి హామీ ఇచ్చారు. గురువారం ఉదయం ఆమె అయ్యప్ప మాలధారుల ఇరుముడి కార్యక్రమంలో కృష్ణగిరి ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకట్రామిరెడ్డి, కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. మాలధారులైన తనయుడు కంగాటి రామ్మోహన్ రెడ్డి, సొసైటీ సీఈఓ రామకృష్ణతో పాటు భక్తులు ఇరుముడి నెత్తినెత్తుకుని శబరిమల బయలుదేరగా వారిని సాగనంపారు. స్వామివారికి పూజలు నిర్వహించి భక్తులకు అల్పాహారం అందించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యే, కుటుంబ సభ్యులను సన్మానించారు.

క్రీడా కార్యక్రమం వాయిదా

ఆలూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించతలపెట్టిన ఆడుదాం-ఆంధ్ర క్రీడా కార్యక్రమాన్ని ఈ నెల 26వ తేదీకి వాయిదా పడినట్లు ఎంపీడీఓ అల్లబకాష్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని తీర ప్రాంతాల్లో ఇటీవల తుపాను ప్రభావంతో నష్టం వాటిల్లడంతో చేపట్టిన సహాయక చర్యలకు ఆటంకం కలుగుతుందనే ఉద్దేశంతో ఆటల పోటీలు నిర్వహణను ఉన్నతాధికారులు వాయిదా వేశారన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో యథావిధిగా క్రీడాకారుల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగుతోందన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

ఆస్పరి: మండలంలోని ఆస్పరి, హలిగేర, నగరూరు గ్రామాలలో గురువారం ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత, ఆధ్యాత్మిక గ్రంథాలపై ప్రబోధ సేవా సమితి గుత్తి, ఎనుగుమర్రి, జొన్నగిరి, తుగ్గలి కమిటీ అధ్యక్షులు రవికుమార్, మోహన్‌క్రిష్ణ, దేవేంద్ర, చంద్రశేఖర్‌తో పాటు సభ్యులు ప్రచారం చేశారు. వీరు గ్రామస్తులతో మాట్లాడుతూ మార్గశిర మాసం, దీపావళి పండుగల ప్రాధాన్యం, భగవద్గీత గురించి వివరించారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

ఎమ్మిగనూరురూరల్: పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ గురువారం బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేఆర్.మురహరరెడ్డి ఆధ్వర్యంలో మార్కెట్ యార్డ్ నుంచి ర్యాలీగా వచ్చి విద్యుత్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం స్పందించి విద్యుత్ చార్జీలను తగ్గించాలని లేని పక్షంలో ఆందోళనలు చేపడతామని పేర్కొన్నారు. ఆ పార్టీ రాష్ట్ర మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి గీతామాధురి, జిల్లా ఉపాధ్యక్షులు బీఎల్.నారాయణ, పట్టణ అధ్యక్షులు కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణానికి భూమి పూజ

ఆస్పరి: మండలంలోని జోహరాపురం గ్రామంలో గురువారం రూ.5లక్షలతో నిర్మించే డ్రైనేజీ నిర్మాణానికి ఎంపీటీసీ సభ్యుడు శ్రీరాములు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సమస్యను తెలుసుకున్న కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సచివాలయం నిధులు కింద రూ.20 లక్షలు మంజూరు చేశారన్నారు. ఇందులో రూ.15 లక్షలతో మంచి నీటి పైపులైన్, రూ.5 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం చేపట్టామన్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన మంత్రికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రామాంజనేయులు, నాయు డు, శివకోటి, నాగరాజు, సురేష్ పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

హొళగుంద: ఈ నెల 24న ఆలూరులో నిర్వహించనున్న మాదాసి, మాదారి కురువ మహా సింహ గర్జనను జయప్రదం చేయాలని బళ్లారి మాజీ డిప్యూటీ మేయర్ శశికళ పిలుపునిచ్చారు. ఆమె గురువారం గజ్జహళ్లి గ్రామ పోతులింగేశ్వరస్వామి ఆలయ ఆవరణంలో కురువల సమావేశం నిర్వహించారు.ఆమె మాట్లాడుతూ.. కురువలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని, ఎస్టీ జాబితాలో చేర్చి, కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కురువ నాయకులు భీమలింగప్ప, బొజ్జన్న, శ్రీనివాసులు, పంపా తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో గ్రానైట్ ఫ్లోరింగ్ ఏర్పాటు

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని రాజుల మండగిరి క్షేత్రంలోని పురాతన శైవక్షేత్రం గర్భాలయానికి దివంగత మాచాని భీమన్న, సంజీవరత్న దంపతుల జ్ఞాపకార్థంగా కుమారులు గ్రానైట్ బండలు వేయించారు. దాతలను గురువారం గ్రామస్తులు, భక్తాదులు అభినందించారు.

సంక్షేమ పాలనతో ప్రతిఒక్కరికీ లబ్ధి



33వ వార్డులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎర్రకోట జగన్

ఎమ్మిగనూరుటౌన్: నాలుగున్నరేళ్ల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాయని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఉదయం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, వార్డు ఇన్‌చార్జ్ వీరేష్‌తో కలిసి 33వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి బుక్‌లెట్‌లను అందజేశారు. వార్డులో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మున్సిపల్ డీఈ మనోహర్‌రెడ్డి, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బుట్టారంగయ్య, యుకె రాజశేఖర్, షబ్బీర్ అహమ్మద్, అమాన్, ఇషాక్, సుధాకర్, ప్రతాప్‌రెడ్డి, విశ్వనాథ్‌రమేష్, కోటకొండ నరసింహులు, సయ్యద్‌చాంద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై శ్రద్ధ లేకుంటే ఎలా ?



ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ప్రశ్నిస్తున్న సభ్యులు

చిప్పగిరి: సర్వసభ్య సమావేశంలో సభ దృష్టికి తెచ్చిన ప్రజా సమస్యల పరిష్కారంపై సంబంధిత అధికారులు శ్రద్ధ చూపకపోతే ఎలా అని ఆర్‌డబ్ల్యూఎస్, వ్యవసాయ, హార్టికల్చర్, రవాణా శాఖల అధికారులను వైస్ ఎంపీపీ నరసింహులు, సర్పంచులు నీలకంఠ, గోవిందు నిలదీశారు. గురువారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జూటూరు హేమలత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారుల పని తీరుపై పలు గ్రామాల సర్పంచులు, నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన అంశాలపై తక్షణమే పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఎంపీపీ జూటూరు హేమలత, ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ, ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కన్వీనర్ జూటూరు మారయ్య, ఎంపీటీసీలు సుంకన్న, బీమలింగ, సర్పంచులు గోవిందరాజులు, వెంకట లక్ష్మి, మల్లమ్మ, తహసీల్దార్ లక్ష్మినారాయణ, ఈఓపీఆర్డీ బాలన్న, ఏఓ విజయ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీ తనిఖీ



హాలహర్వి పోలీసులకు సూచనలు చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

హాలహర్వి: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను గురువారం పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. కేసులు పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. రాజీ అయ్యే కేసులకు సంబంధించి కక్షిదారులను పిలిపించి లోక్‌అదాలత్ ద్వారా కేసులు రాజీ అయ్యేలా కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారు ఎంతటివారైనా వదిలిపెట్టవద్దని ఆదేశించారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ నాగేంద్ర, కానిస్టేబుళ్లు ఉన్నారు.

ఘనంగా పడిపూజ



పడిపూజలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

చిప్పగిరి: స్థానిక శ్రీ భోగలింగేశ్వర స్వామి ఆలయంలో గురుస్వామి జెడ్పీటీసీ విరుపాక్షి ఆధ్వర్యంలో గురువారం అయ్యప్ప స్వాముల ఇరుముడి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వందలాదిగా అయ్యప్ప స్వాములు తరలివచ్చి శ్రీ అయ్యప్ప స్వామి మహా పడిపూజ, ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్నారు. 48 రోజుల పాటు దీక్ష చేపట్టిన మాలధారులకు స్థానిక రాయచోటయ్య స్వామి ఆలయంలో గురుస్వామి విరుపాక్షి అన్నదానం ఏర్పాటు చేశారు.

మద్దికెర: మండలంలోని మదనంతపురంలో అయ్యప్ప మాలధారులు స్వామి వారిని గురువారం ప్రత్యేకంగా అలంకరించి పడిపూజలు నిర్వహించారు. స్వామి 18 మెట్లను పూలతో అలంకరించి స్వామిగీతాలు ఆలపించారు. సాయంత్రం స్వామి చిత్రపటాన్ని గ్రామ పురవీధుల గుండా మేళతాళాలతో ఊరేగింపు చేశారు. పెద్దఎత్తున మాలధారులు, భక్తులు పాల్గొన్నారు.

పేదల ప్రభుత్వాన్ని నిలబెట్టుకుందాం



నెల్లిబండలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న గుమ్మనూరు ఈశ్వర్



హెచ్.కైరవాడిలో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



వెల్దుర్తిలో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న బొమ్మన రవిరెడ్డి

దేవనకొండ: ప్రజా సంక్షేమం కోసం పాటుపడే గొప్ప వ్యక్తి సీఎం వైఎస్ జగనన్న అని వైఎస్సార్‌సీపీ యువ నాయకులు గుమ్మనూరు ఈశ్వర్ అన్నారు. ఈ మేరకు గురువారం మండలంలోని నెల్లిబండ గ్రామంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. గుమ్మనూరు ఈశ్వర్ మాట్లాడుతూ ఇంతవరకు ఏ ప్రభుత్వం చేపట్టని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేసి పేదల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. సంక్షేమ పాలన సాగిస్తున్నసీఎం జగనన్నకు రానున్న ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మల్లికార్జున, జెడ్పీటీసీ రామకృష్ణ, మండల జేసీఎస్ కన్వీనర్ రాజారెడ్డి, లుముంబా పాల్గొన్నారు.

గోనెగండ్ల: రాష్ట్రంలోని పేదలకు మేలు జరగాలన్నా.. బడుగు బలహీన వర్గాలు రాజకీయంగా ఉన్నత స్థానాలకు వెళ్లాలన్నా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని జేసీఎస్ మండల కన్వీనర్ మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని హెచ్.కై రవాడి గ్రామ సచివాలయం-2లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగనన్నకే దక్కుతుందన్నారు. పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ మోహన్ రెడ్డి, పులికొండ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న సీఎం జగనన్నను రాబోవు ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సచివాలయం-3 పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాసరావ్, సర్పంచ్ ముత్యాల శైలజ, ఈఓ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. జెడ్పీటీసీ సుంకన్న, పార్టీ శ్రేణులతో కలిసి ఎస్సీ కాలనీ ఓవర్‌హెడ్ ట్యాంక్ వద్ద వైఎస్సార్సీపీ జెండా ఆవిష్కరించారు. సచివాలయ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి గత టీడీపీ పాలన, ప్రస్తుత ప్రభుత్వ పాలన బేరీజు వేసుకోవాలని ప్రజలకు సూచించారు. నాయకులు బొమ్మన పెద్దిరెడ్డి, ఆరిఫ్, పెద్దన్న, రాజు, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.